విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 27, ఆగస్టు 2025

యూరియా కొరతపై కలెక్టర్‌తో మంత్రి సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లాలో యూరియా కొరత అంశంపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాతో రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమీక్షించారు. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మంత్రి బీసీ జనార్థన్ రెడ్డిని కలెక్టర్ రాజకుమారి గణియా కలిసిన సందర్భంగా మంత్రి బిసి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయానికి అవసరమైన మేరకు యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ కు సూచించారు. రైతులకు యూరియా సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. రైతులు యూరియా సరఫరా అంశంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రైతులందరికీ సరిపడా యూరియా అందజేయడం జరుగుతుందని భరోసా వ్యక్తం చేశారు. యూరియా కోనుగోలు విషయంలో బ్లాక్ మార్కెట్ కు ఆస్కారం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర-అవుకు: పశు వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రైతులకు అందుబాటులో ఉండాలి అని పశుసంవర్ధక శాఖ ఏడి మారుతి సకారం అన్నారు. మంగళ వారం పట్టణంలోని పశు వైద్య కార్యాలయంలో పశు వైద్యాధికారి డాక్టర్ భారతీదేవితో కలిసి సిబ్బంది తో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటిస్తూ పాడి పరిశ్రమ రైతులకు అందుబాటులో ఉండాలని అన్నారు. రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. సబ్సిడీ పోను ఐదు కేజీల ప్యాకెట్ కు 115రూపాయలు రైతులు చెల్లించాలని అన్నారు.అవసరం ఉన్న రైతులు స్థానిక పశు వైద్యశాలలో సంప్రదించాలని అన్నారు.

మేనేజర్‌పై విచారణ చేపట్టాలి : సీపీఐ

విశాలాంధ్ర -డోన్ : డోన్ మార్కెట్ యార్డ్ డిసి యమ్ ఎస్ బ్రాంచి మేనేజర్ రాఘవేంద్ర రెడ్డిపై విచారణ చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి నారాయణ అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ డోన్ మండలానికి దాదాపుగా 678 టన్నుల యూరియా ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. డోన్ ప్రభుత్వ గొడముకు వచ్చింది అయితే 67 టన్నుల యూరి యాను ఒక్క రైతుకు నాలుగు బస్తాల యూరియాని ఇవ్వకుండా బ్లాక్ మార్కె ట్‌కు తరలించారని ఆరోపణలు ఉన్నాయన్నారు. దాదాపుగా డోన్ బ్రాంచ్ మేనేజర్‌ని రైతులు అడుగుతే యూరియా స్టాక్ లేదని, రైతులందరికీ వచ్చిన యూరియను పంచినామని చెప్పడం సరికాదన్నారు. వాటిని వివరాలు ఏ రైతుకి ఏ గ్రామానికి ఇచ్చినారు వారి వారి వివరాల ను బయటపెట్టాలని, వ్యవసాయ శాఖ అధికారులు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని సూచించారు. అక్రమంగా యూరియాను విక్రయించిన వారి పై కఠినమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నా మన్నారు. లేదంటే రైతుల పక్షాన ఆందోళన సిద్ధమవుతావని వారన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు విజయుడు, పృద్వి కుమార్,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేసిన వారికే పెద్దపీట

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన వారికి అధిష్టానం పదవుల్లో పెద్దపీట వేస్తుందని మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బిసి జనార్దన్ రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం టిడిపి నంద్యాల జిల్లా పార్టీ కార్యాల యం నందు పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశీలకులుగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఆర్టీసీ కడప జోన్ ఛైర్మన్ పూల నాగరాజు హాజరయ్యారు. సందర్భంగా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బిసి జనార్ధన్ రెడ్డిలు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల కమిటీ ఎంపిక క్రమంలో త్రిసభ్య కమిటీ ముందు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వెల్లడించారని, ఆశావహులు సైతం తమకు ఆసక్తి గల పార్టీ పదవులపై త్రిసభ్య సభ్య కమిటీ ముందు తెలియజేశారని, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి,బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గౌరు చరితా రెడ్డి,గిత్త జయసూర్య, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు, కౌన్సిలర్లు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ఆణిముత్యాలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : జిల్లాలో విద్యారంగంలో అట్టడుగు స్థాయిలో ఉన్న కొలిమిగుండ్ల మండలం నుండి నీట్‌లో అద్భుత ప్రతిభా కనబరిచిన ఐదుగురు విద్యార్థులు ఎంబిబిఎస్ సీట్లను సాధించారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు విద్యా ఆణిముత్యాలుగా నిలిచారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వెనుకబడిన మండలం నుండి ఐదుగురు విద్యార్థులు ఎంబిబిఎస్ సీట్లు సాధించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు. మండలంలోని రాఘవ రాజు పల్లి గ్రామానికి చెందిన అంబటి బాల నాగిరెడ్డి రమాదేవి కూతురు విజయలక్ష్మి నీట్‌లో 508 మార్కులు సాధించి చిత్తూరులోని అపోలో మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు, కొలిమిగుండ్లకు చెందిన బి.రవి ప్రకాష్ గౌడ్ భాగ్యలక్ష్మి కుమారుడు జయంత్ గౌడ్ 506 మార్కులతో విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కళాశాల, రాఘవ రాజు పల్లికి చెందిన అంబటి సాయి ప్రతాప్ రెడ్డి చంద్రమణి కుమారుడు హేమ సాయి తేజ రెడ్డి 488మార్కులతో కుప్పంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, కనకాద్రి పల్లి గ్రామానికి శీలం వెంకటసుబ్బయ్య పద్మావతి కుమారుడు వెంకట కార్తీక్ 483 మార్కులతో నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ,బెలుం గ్రామానికి చెందిన కోనేటి ప్రసాద్ పుష్పావతి కుమార్తె నివేదిత 474 మార్కులతో అనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీట్లు సాధించారు. ఒకే విద్యా సంవత్సరంలో ఐదు మంది విద్యార్థులు ఎంబిబిఎస్ సీట్లు సాధించడంతో ప్రజలు కొనియాడుతున్నారు.

పండగను ప్రశాంతంగా నిర్వహించుకోండి

విశాలాంధ్ర-అవుకు: వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి అని ఎస్ఐ రాజారెడ్డి అన్నారు. మంగళ వారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం నందు గణేష్ నిమజ్జనం నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎస్ఐ రాజారెడ్డి, విద్యుత్ ఏఈ పకీరయ్య, ఈఓఆర్డి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవుకు మండలంలో మూడవ రోజున నిమజ్జనం చేయాలని అన్నారు. నిమజ్జన కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమై ఉప్పలపాడు రోడ్డులో ఉన్న జలాశయం వద్ద నిమజ్జన ఘాటుకు 6 గంటల లోపల తరలి వెళ్లాలని అన్నారు. గణేష్ మండపాల వద్ద విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి సౌండ్ సిస్టంకు అనుమతి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ నిమజ్జన నిర్వాహకులు పాల్గొన్నారు.

విగ్రహంపై పేడ జల్లిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం సానా రుద్రవరం సెంటర్ లో స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహాము పై పేడ జల్లి అవమానపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని అహోబిలం శ్రీ కృష్ణదేవరాయ కాపు బలిజ నిత్య అన్నదాన సత్రం అధ్యక్షులు శెట్టి విజయకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలకోసం పనిచేసిన రంగ విగ్రహం పై పేడ జల్లి అవమానించిన వారి పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహాల పట్ల అవమానకర సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన తహసీల్దార్

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : బనగానపల్లె మండలంలోని కైప చెరువు (హర్ ఘర్ గంగా గణేష్ ఘాట్) వద్ద మంగళవారం నిమజ్జణ ఏర్పాట్లను పరిశీలించిన బనగానపల్లె మండల తహసిల్దార్ నారాయణరెడ్డి, ప్రభుత్వ విద్యుత్ శాఖ అధికారులు,ఘాట్ ఇన్చార్జ్ కోడి నాగేష్ బాబు. వినాయక చవితి సందర్భంగా బనగానపల్లె పల్లె ప్రజలు ప్రశాంతంగా పండగను జరుపుకోవాలని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగ ఉండాలని మండల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె మండల తాహసిల్దార్ నారాయణరెడ్డి, వినాయక ఘాట్ ఇన్చార్జి కోడి నగేష్ బాబు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పూజలందుకునేందుకు తరలివస్తున్న గణనాధులు

విశాలాంధ్ర - రుద్రవరం : వినాయక చవితి పురస్కరించుకొని గ్రామాలలో కొలువుదీరేందుకు గణేష్ విగ్రహాలను గ్రామస్తులు వివిధ వాహనాలలో గ్రామాలలోకి మంగళవారం తీసుకువచ్చారు. మండలం లోని పలు గ్రామాలలో వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాలను ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన మండపాలలో కొలువు తీరేందుకు మేల తాళాల మధ్య గ్రామాలలోకి విగ్రహాలను ఊరేగిం పుతో మండపాల వద్దకు గ్రామస్తులు చేర్చారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే మండపాలను గ్రామస్తులు అందంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం నుండి వినాయకునికి ప్రత్యేక పూజలను చేయడం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు.

దివ్యాంగులను ఇబ్బంది పెట్టొద్దు : శబరి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : సీఎం చంద్రబాబు నాయుడు అర్హులైన దివ్యాంగులందరికి సదరన్ క్యాంపుల ద్వారా మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చి నెలకు రూ. 6వేల పెన్షన్ అందిస్తున్నారని, కొందరు ఈఎన్టీ వైద్యుల అలసత్వం వల్ల సదరన్ క్యాంపుకు వచ్చిన దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని, ఇలా చేస్తే సీఎం చంద్రబాబు లక్ష్యం ఎలా నెరవేరుతుందని ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం నంద్యాల ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదరన్ క్యాంపుకు వచ్చే వికలాంగులను ఎందుకు తిప్పుకుంటున్నారని, స్లాట్ బుక్ చేసుకొని ఆ తేదీనే వస్తే ఎందుకు పరీక్షలు చేయడం లేదని, కడప రిమ్స్ హాస్పిటల్‌కు ఎందుకు రెఫర్ చేస్తున్నారని ప్రభుత్వ ఈఎన్టీ డాక్టర్‌ను ప్రశ్నించారు. ఈఎన్టీ విభాగంలో అవసరమైన ఆధునిక ఆడియో పరికరాలకు ఎంపీ నిధులు కేటాయిస్తానని, వారిని ఇబ్బంది పెట్టవద్దని వైద్యులకు ఎంపీ శబరి సూచనలు చేశారు. ఎంపీ వెంట మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మదన్ మోహన్, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటకృష్ణ, ఈఎన్టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జైబా కౌశల్, డాక్టర్ సుహేల్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ దొంగల ముఠా అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : అంతర్రాష్ట్ర దారి దోపిడీ దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ ఆదేశాల మేరకు నంద్యాల ఎఎస్పీ ఎం.జావళి ఆల్ఫోన్స్ సూచనలతో పాణ్యం సిఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి వారి సిబ్బంది, నంద్యాల సిసిఎస్ సిబ్బంది పాణ్యం మండలం పిన్నపురం కొండలలోని దుర్గం వాగులో ఉన్న వాటర్ ఫాల్స్ సమీపంలో వీరిని పట్టుకోవడం జరిగిందన్నారు. 2016వ సంవత్సరం నుండి ఇప్పటి వరకు నంద్యాల, కర్నూలు, ప్రకాశం, సత్యసాయి, అన్నమయ్య, గుంటూరు జిల్లాలలోని వివిద పోలీస్ స్టేషన్ల పరిదిలలో దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతూ 8 సంవత్సరాల నుండి తప్పించుకు తిరుగుతున్న చెంచు దాసరి అంకన్న, బాపట్ల సత్య హరిచంద్రుడు, బాపట్ల చిన్న హుస్సేన్, చెంచు దాసరి ఈరన్నలను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుండి సుమారు 11తులాల బంగారు, 21 తులాల వెండి, రూ.10,100 నగదు, రెండు మోటర్ సైకిళ్లు, 4 పిడిబాకులు, 2 కత్తులను స్వాదినం చేసుకోవడం జరిగిందని, వీటి మొత్తం విలువ సుమారు రూ.10 లక్షల 85 వేలు ఉంటుందన్నారు. దొంగతనం కేసు రికవరీలో ప్రతిభ కనబరచిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబు, నంద్యాల సబ్ డివిజన్ ఎఎస్పీ మందా జావళి అల్ఫోన్స్ అభినందించడంతో పాటు నగదు రివార్డులను అందజేశారు.

ఆసుపత్రిలో వైద్యుల కొరత.. రోగుల అవస్థలు

విశాలాంధ్ర - వెలుగోడు : ప్రజలకు అతి ముఖ్యమైన అంశాలలో విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. వీటికోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. కానీ ప్రజలకు వైద్యం అరకొర గానే అందుతుంది. ప్రధానంగా వైద్యులు ఆశించిన స్థాయి లో లేకపోవడం కారణం. వెలుగోడు పట్టణం లో సామాజిక ఆరోగ్య కేంద్రం కలదు. వెలుగోడు మేజర్ గ్రామ పంచాయతీ నందు సుమారు 40 వేల జనాభా కలదు. ఈ ఆసుపత్రి కి మండలం లోని అన్ని గ్రామాల ప్రజలు వైద్య చికిత్స కొరకు వస్తుంటారు. ఎంతో ప్రాధాన్యత కల్గిన ఈ ఆసువత్రి నందు అన్ని సౌకర్యాలు ప్రజలకు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు కల్పించాల్సి ఉంది. ఈ ఆసుపత్రిలో 7మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ముగ్గురు వైద్యులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఒక వైద్యుడు రాత్రి డ్యూటీ చేస్తే, ఇద్దరు వైద్యులే ఆసుపత్రికి దిక్కు. ఒక డాక్టర్ జనరల్ సర్జన్ ప్రమోషన్ పై ఇతర చోటికి బదిలీ పై వెళ్లారు. ఆ స్థానం లో ఎవరిని నియమించ లేదు. మరో లేడీ డాక్టర్ మెటర్నిటీ సెలవు లో వెళ్లారు. మరో డాక్టర్ నంద్యాల జిల్లా మంత్రి బంధువు కుమారుడు దింతో నంద్యాల ఆసుపత్రిలో మూడు రోజులు, ఇక్కడ మూడు రోజులు విధులు నిర్వహించుటకు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కానీ వెలుగోడు ఆసుపత్రికి విధులు నిర్వహిం చడానికి ఒక్కరోజు వస్తే గొప్ప.ఒక్క రోజు కూడా వచ్చిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. మంత్రి బంధువా మజాకానా అని చర్చించుకుంటున్నారు. మరో డాక్టర్ పండగ సెలవు తీసుకున్నారు. లేడీ డాక్టర్ రాత్రి డ్యూటీ చేయడం తో మరుసటి రోజు రాలేదు. ఇద్దరు డాక్టర్లు మంగళ వారం విధులకు వచ్చారు. ఓపి చూస్తే సుమారు రెండు వందల నుంచి నాలుగు వందల మంది రోగులు చికిత్స కొరకు వచ్చారు. భారీగా వచ్చిన రోగులతో ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వహించడం ఇబ్బందిగా మారింది.రోగులు చికిత్స కొరకు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ ఆసుపత్రి సౌకర్యాల గురించి ప్రభుత్వం కానీ, స్థానిక ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదు. ఆసుపత్రికి వైద్యుల కొరత గురిం చి కానీ, సిబ్బంది తక్కువ గురించి కానీ, మిగతా పరికరాల సౌకర్యాల గురించి ఏ నాడైనా ప్రజా ప్రతినిధులు పట్టించుకు న్నారా.. ఏ నాడైనా ఆసుపత్రిని సందర్శించారా.. ఈ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీర్చాలని,స్టాఫ్ నర్సులను మరి కొంతమందిని నియమించాలని, ఆసుపత్రి స్థాయికి తగినట్లు అన్ని రకాల విలువైన మందులు సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

సుబ్బరాయుడు మృతి సీపీఐకి తీరని లోటు

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: సీపీఐ నాయకుడు సుబ్బరాయుడు మృతి పార్టీకి తీరనిలోటని సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, సహాయ కార్యదర్శి భూమని శ్రీనివాసులు పేర్కొన్నారు. సుబ్బరాయుడు సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరమని, సుబ్బరాయుడు గత పది సంవత్సరముల నుండి ఏఐటీయూసీ ఆటో యూనియన్ అబ్దుల్ కలాం ఆజాద్ సెంటర్లో ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా, డిహెచ్‌పిఎస్ పట్టణ సహాయ కార్యదర్శిగా, సిపిఐ సలీంనగర్ శాఖ సహాయ కార్యదర్శిగా ఉంటూ ఉద్యమాలలో చురుకుగా పాల్గొనేవాడని, అలాంటి నాయకుడు మరణించడం సిపిఐకి తీరని లోటన్నారు. ఆళ్లగడ్డ తాలూకా జమ్ములదీన్నే గ్రామంలో మంగళవారం ఖనన సంస్కరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన భౌతిక కాయానికి ఎర్రజెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రహిమాన్, ఖాజా హుస్సేన్, బోలా,అబ్దుల్ కలాం,చంద్ర,షేక్షా,హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పోలూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: నంద్యాల మండలంలోని పోలూరు గ్రామంలో ప్రజలకు ఎటువంటి అంటురోగాల ప్రబలకుండా పారిశుధ్య పనులను గత ఐదు రోజుల నుండి కొనసాగిస్తున్నామని గ్రామ సర్పంచ్ పొన్నపాటి ప్రతాప్ ఆర్ఐ మాధవిలతలు తెలిపారు. మంగళ వారం గ్రామంలోని వీధుల్లో చెత్తా చేదారాలను తొలగించి దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ వేస్ట్ ఆయిల్ చల్లించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఎంపీడీవో సుగుణ శ్రీ ఆదేశాల మేరకు గ్రామంలో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ముందు జాగ్రత్తగా పనులను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సర్పంచ్ ప్రతాప్ ఆర్ఐ మాధవిలత ఆధ్వర్యంలో గ్రామ సర్కిల్ నందు" స్వచ్ఛభారత్ - స్వచ్ఛ్ ఆంధ్ర"అనే నినాదాలతో మానవహారం ఏర్పాటు చేసి గ్రామ పెద్దలతో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

విశాలాంధ్ర - ప్యాపిలి : పట్టణంలో మంగళవారం స్థానిక ఏకలవ్య విగ్రహం ఆవరణంలో ప్రభుత్వ వైద్యాధికారి ఎల్లప్ప, ఏకలవ్య సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు మనోరమ వినాయక చవితి సందర్భంగా వీరు పట్టణ ప్రజలకు ఉచితంగా వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి గణపతితు లను పూజించి పర్యావరణాన్ని కాపాడుదాం అని అన్నారు. సమితి సభ్యులు శేఖర్ ,శేషాద్రి,మహేంద్ర,బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలంలోని ఓబులంపల్లి గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని తాహసిల్దార్ జ్యోతి రత్నకుమారి, వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి మంగళవారం తనిఖీ చేసి యూరియా స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఓబులంపల్లె రైతు భరోసా కేంద్రానికి వచ్చిన పది టన్నుల యూరియా ను రైతులందరూ తీసుకొని వెళ్లినట్లు స్టాక్ రిజిస్టర్ లో పొందుపరిచి ఉందన్నారు. మండలంలోని ఓబులంపల్లి అంగన్వాడి - కేంద్రం ప్రీస్కూల్ ను తాహసిల్దార్ జ్యోతి రత్నకుమారి మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలో మెనూ రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పిల్లలకు ఇచ్చే బాలామృతం గుడ్లు, పాలు బాలింతలకు, గర్భవతులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిడ్స్ అందుతున్నాయా అని అంగన్వాడీ వర్కర్‌ను అడిగి తెలుసుకున్నారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

విశాలాంధ్ర - చాగలమర్రి : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని మండల విద్యాశాఖాధికారి న్యాంతుల్లా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం పురష్కరించుకొని పాఠశాల హెచ్ఎం జీవయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు,పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. సీనియర్ ఉపాధ్యాయులు ఐడికే శాస్త్రి,మహబూబ్‌భాష,పిడీ శ్రీనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని కస్తూరిభా పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పటు చేసారు. ఈ సందర్భంగా పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ రమేష్ 251 మంది విద్యార్థినీలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 18 మందినీ కంటి అద్దాలకు సిఫారస్ చేయగా మరో 6 మందిని నంద్యాలలోని కంటి వైద్యశాలకు రెఫర్ చేసారు. అనంతరం కంటి చూపు మెరుగుపడటం కోసం ఆకుకూరలు, విటమిన్ ఏ అధికంగా లభించే ఆహార పదార్థాలను అందించాలను సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, హెల్త్‌సూపర్‌వైజర్ రామలింగారెడ్డి,ఎంఎల్‌హెచ్‌పి సమత,ఏఎన్ఎం వెంకటలక్ష్మి,ఆశ కార్యకర్తలు పెద్దక్కసుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యూరియా బ్లాక్ మార్కెట్ తరలిస్తే చర్యలు

విశాలాంధ్ర-కోవెలకుంట్ల: యూరియా బ్లాక్ మార్కెట్ తరలించిన రైతులకు అధిక ధరలు అమ్మిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు వ్యాపారస్తులను హెచ్చరించారు. మంగళ వారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను అధికారులు తనిఖీలు చేపట్టారు. తాసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి,, వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి కలిసి ఎరువులు దూకాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దుకాణాలలో యూరియా ఎరువులు నిలువ ఉంచిన, అమ్మకపోయినా అధిక ధరలకు అమ్మిన అటువంటి దుకాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో రెవిన్యూ సిబ్బందితోపాటు పోలీస్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

పాములపాడులో స్వామిత్ర కార్యక్రమం

విశాలాంధ్ర - పాములపాడు : మండల పరిధిలో జరుగుతున్న స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా, పాములపాడు గ్రామంలో ప్రతి ఇంటి ఆస్తులు మరియు గ్రామపంచాయతీ ఆస్తుల కొలతలు వేయడం మంగళవారం ప్రారంభమైంది. ఎంపీడీవో చంద్రశేఖర్ డిప్యూటీ ఎంపీటీవో సులోచన సర్వేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలలో పాములపాడు, మిట్టకందాల,చెలిమిళ్ల,వానాల, మద్దూరు, భాను ముక్కల గ్రామాలలో ఈ కార్యక్రమం జరుగుతుంది. అందులో భాగంగా పాములపాడు గ్రామంలో మొత్తం 1921 ఆస్తుల వివరాలను సేకరించి కొలతలు వేయడానికి మూడు ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టీములో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్,ఇంజనీరింగ్ అసిస్టెంట్,సర్వేయర్‌లు పాల్గొని ఇంటి వారీగా, ప్రభుత్వ స్థలాలను కొలతలు వేయడం జరుగుతుంది. సేకరించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయబడతాయి. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ స్వామిత్ర కార్యక్రమంలో పాములపాడు పంచాయతీ కార్యదర్శి బి.క్రాంతికుమార్,డిజిటల్ అసిస్టెంట్ మరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని స్థానిక పాత బస్టాండ్ లో గల కిరణ్ జనరల్ స్టోర్ వారి ఆధ్వర్యంలో 1000 మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా కాకనూరు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివ యోగేంద్ర సర్వస్వతి, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు,ఆత్మకూరు పట్టణ డిఎస్పి రామాంజనాయక్, పట్టణ సీఐ రాము, ఎస్సై వెంకట నారాయణరెడ్డి, పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రకృతికి హాని కలిగించని ఈ మట్టి వినాయకులు వాడడం ద్వారా నీరు కలుషితం కాదని త్వరగా నీళ్లలో కరిగిపోవడానికి అవకాశం ఉంటుందని ప్రతి సంవత్సరం ఇలా మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం చాలా సంతోషకరమైన విషయమని ఈ వినాయక చవితిని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఎటువంటి నిర్విఘ్నం జరగకుండా ఆ నిర్విఘ్న గణపతి మీ ఇంట్లో కొలువై ఉండాలని ప్రజలందరూ ఎల్లవేళల సంతోష సంపన్నులై ఉండాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నరహరి సత్యం, నరహరి బాలయ్య, గుటారి సుబ్బారాయుయ్య, గొల్ల సత్యం, ఆవుల్ రెడ్డి, వాసుదేవ్, కిరణ్ జనరల్ స్టోర్ శేగు కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి : ఎంఈవో

విశాలాంధ్ర - మిడుతూరు: విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేయాలని ఎంఈఓ 2 మల్లికార్జున నాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం చతుర్విధ ప్రక్రియలు నేర్పించాలన్నారు. నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు, పాఠశాల చుట్టు పరిసరాలు, మధ్యాహ్న భోజనం తనిఖీ, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట శేషయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పండ్ల తోటలను పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : రైతులు పండ్ల తోటలు పూల పంటలను పెంపొందించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ రైతులకు సూచించారు. మంగళవారం నంద్యాల మండలం లోని బ్రాహ్మణపల్లి, పాండురంగాపురం గ్రామాలలో పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు పండ్లతోటలు పెంపొందించుకోవడానికి ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తుందన్నారు. సపోటా, మామిడి, జామ అలాగే పూల తోటలు పండించడానికి రైతులు ముందుకు వచ్చి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. నంద్యాల మండల ఏపీవో గణేష్, ఈసీ అశోక్,టిఏలు సుబ్బారాయుడు,ఫక్రుద్దీన్, పీల్డ్ అసిస్టెంట్ జాన్సన్ రైతులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, బుధవారం 27, ఆగస్టు 2025

కోర్టు ఆదేశించిన సచివాలయ భవనం అప్పగించరా..?

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలోని కోగిల తోట జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణంలో గత ప్రభుత్వ హాయంలో 25 లక్షల రూపాయలతో గ్రామ సచివాలయం భవనం పూర్తిగా నిర్మించారని సచివాలయ భవనాన్ని హై స్కూల్ పరిధిలోకి అప్పగించాలంటూ అధికారులకు సంవత్సరం నుండి ఎన్నోసార్లు విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని మండల టిడిపి కన్వీనర్ వీరన్న గౌడ అన్నారు. గ్రామ సచివాలయం భవనం హై స్కూల్ కు అప్పగించాలంటూ డిప్యూటీ ఎంపీడీవో పీఎం ఎంచక్రవర్తి, ఎంఈఓలు సుధా రాణి, కబీర్ సాబ్లతో మండల టిడిపి కన్వీనర్ వీరనాగౌడ, హై స్కూల్ చైర్మన్ బసవరాజ్, గ్రామ పెద్దలు గోవర్ధన్, రంగన్న, వీరాంజనేయ, దేవన్న, బసవ,ఈసా,హెడ్మాస్టర్ చిన్న లాలు స్వామి, ఉపాధ్యాయుడు పుల్లన్న, మంగళవారం అధికారులతో చర్చించారు. మండల టిడిపి కన్వీనర్ పి.వీరన్న గౌడ మాట్లాడుతూ హై స్కూల్ ఆవరణంలో ఇతర భవనాలు నిర్మించకూడదంటూ కోర్టు ఆదేశాలు ఇచ్చిందని కట్టిన భవనాలను వెంటనే హై స్కూల్‌కు అప్పగించాలంటూ కోర్టుఉత్తర్వులు ఇచ్చిన అధికారులు చీమకుట్టినట్టు కూడా లేదని ఆగ్రహించారు. హైస్కూల్లో 460 మంది విద్యార్థులు చదువుకుంటున్నా రని 8 గదులు మాత్రమే ఉన్నాయని విద్యార్థులకు తగ్గట్టు భవనాలు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే చదువుకుంటున్నారని విద్యార్థులకు పాములు, తేళ్లు, కుక్కకాటు వేస్తే ఎవరు బాధ్యత వహిస్తారు అని అధికారులను నిలదీశారు.సచివాలయం భవనం హై స్కూల్ కు అప్పగించకపోతే హై స్కూల్‌కు తాళం వేస్తామని జిల్లా పరిషత్ హై స్కూల్ చైర్మన్ బసవరాజు హెచ్చరించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకొని గ్రామ సచివాలయ భవనాన్ని హై స్కూల్‌కు అప్పగించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి సమాధానం ఇస్తూ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గణేష్ పండుగ తరువాత గ్రామానికి వచ్చి సచివాలయం భవనం పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. మండల టిడిపి కన్వీనర్ వీరన్న గౌడ, హై స్కూల్ చైర్మన్ బసవరాజ్, గ్రామ పెద్దలు గోవర్ధన్, బసవ, వీరాంజిని, రంగన్న, దేవన్న హెడ్మాస్టర్ చిన్న లాల్ స్వామి, ఉపాధ్యాయుడు పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్

సర్టిఫికేట్ వెరిఫికేషన్ సజావుగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈనెల 28వ తేదీన మెగా డీఎస్సీ అభ్యర్థులకు సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ సజావుగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలనపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. 2645 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని కలెక్టర్ తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ, శ్రీనివాస బీఎడ్ కాలేజీ, రాఘవేంద్ర బీఎడ్ కాలేజీ లలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతోందన్నారు. అందుకు గాను పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమ యూనివర్సిటీకి స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస బి.ఎడ్ కాలేజీకి హౌసింగ్ పిడి చిరంజీవి, రాఘవేంద్ర బి.ఎడ్ కాలేజ్‌కి పీఏ టు స్పెషల్ కలెక్టర్ కొండయ్యలను ఇన్చార్జి లుగా ఉంటారని కలెక్టర్ తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీలో 8 బ్లాక్ లలో వెరిఫికేషన్ జరుగుతున్నందున ఒక్కొక్క బ్లాక్‌కు ఒక్కొక్క అధికారిని ఇన్చార్జిగా నియమించాలని కలెక్టర్ డీఆర్వోను ఆదేశించారు. ఇప్పటికే రెవెన్యూ సిబ్బందిని కొంతమందిని నియమించడం జరిగిందన్నారు. మూడు కేంద్రాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.. అదే విధంగా అభ్యర్థులు సులభంగా కేంద్రాలకు వెళ్లే విధంగా మార్గదర్శనం చేస్తూ సైనేజ్ బోర్డు లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిఇఓను ఆదేశించారు. ప్రతి కేంద్రంలో నెట్ కనెక్షన్ కు ఏమాత్రం ఇబ్బంది లేకుండా పకడ్బందీ గా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు. అదే విధంగా ప్రతి కేంద్రంలో టాయిలెట్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థులకు శుక్రవారం నాడు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. అదే విధంగా బస్టాండ్‌లో, నంద్యాల చెక్పోస్ట్ దగ్గర అభ్యర్థులకు కేంద్రాలకు వెళ్లే విధంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. టెలికాన్ఫరెన్సో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, డీఈవో శామ్యూల్ పాల్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణ పనులు త్వరలో ప్రారంభం

నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలోని రహదారి విస్తరణ పనులను త్వరలో ప్రారంభించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఉస్మానియా కళాశాల వద్ద విస్తరణ పనులు చేపట్టాల్సిన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కిడ్స్ వరల్డ్ కూడలి నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు మాస్టర్ ప్లాన్ (ఆర్డీపి-2) ప్రకారం రహదారి విస్తరణ చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఆస్తి ప్రభావిత యజమానులకు పరిహారం త్వరలో అందిస్తామని, మొత్తం 740 మీటర్ల పొడవున పనులు జరుగుతాయని, దాదాపు 183 యజమానుల ఆస్తులు ప్రభావితమవుతాయి. నగరాభివృద్ధి కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పరిహారం వీలైనంత త్వరగా అందిస్తామని కమిషనర్ తెలిపారు.కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇన్స్పెక్టర్ మధుగోపాల్, ఎం. అష్రఫక్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో వినాయక చవితి సంబరాలు

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : పార్వతి పరమేశ్వరుల కుమారుడైన వినాయకుడి పుట్టినరోజును భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారని స్కూల్ ఎజిఎం అన్వర్ భాష తెలిపారు. వినాయక చవితినీ పురస్కరించుకొని మంగళవారం స్థానిక మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్ అధ్యక్షతన వినాయకునికి ఘనంగా పూజలు నిర్వహించారు. వేడుకలకు స్కూల్ ఎజిఎం ముఖ్యంగా హాజరై వినాయక చవితి పండగ విశిష్టతను వివరించారు. గణేశుడు జ్ఞానానికి, విజయానికి అధిపతిగా విద్యార్థులు భావిస్తారని, అందుకే పండుగను శ్రేయస్సు, సంపద కోసం జరుపుకుంటారన్నారు.ప్రతి ఇంటికి వినాయకుడి విగ్రహాన్ని తీసుకువచ్చి, పసుపు, కుంకుమ, పూలు, అక్షతలు, పండ్లు,ఉండ్రాళ్ళు వంటి పూజా సామాగ్రినీ సమర్పించారు.వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, రాధ పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

విఘ్నాలు తొలిగి విజయాలు చేకూరాలని ఆకాంక్ష

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి, మరియు మీడియా మిత్రులకు, వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలు, గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అవాంఛనీయ ఘటనలకు, అపశృతులకు తావులేకుండా ఇతరులకు అసౌకర్యం కల్గకుండా జరుపుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న వినాయక మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నుండి అనుమతులు పొంది ఉండాలని వారి సలహాలు, సూచనలు పాటించి ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్లు, మైకులు ఆపి వేసే విధంగా విగ్రహ ఉత్సవ కమిటి నిర్వాహకులు చూసుకోవాలన్నారు. విగ్రహాల వద్ద తాత్కలిక సిసి కెమెరాలు గాని, ముఖ్యంగా రాత్రి వేళల్లో విగ్రహాల వద్ద ఒకరిని కాపాలా, పర్యవేక్షించుకునే బాధ్యత విగ్రహ ఉత్సవ కమిటి నిర్వహకులదేనని, ఎమైనా సంఘటనలు తలెత్తితే వెంటనే సంబంధిత స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఈ సంధర్భంగా జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ గారు తెలిపారు. మత సామరస్యానికి కర్నూలు జిల్లా ప్రతీక అని, కుల, మత విభేదాలు లేకుండా ప్రజలందరూ సోదర భావంతో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకునేందుకు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటి సభ్యులు, నిర్వాహకులు, మేధావులు, మత పెద్దలు, రాజకీయ పార్టీలు, యువత, మీడియా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని కృపతో జిల్లా అభివృద్ధితో పాటు ప్రజలంతా సంతోషంగా ఉండాలని, వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని, చేపట్టే ప్రతి పనిలో విజయం చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మట్టి వినాయకుని విగ్రహాలతో పూజలు జరుపుకుని, సంతోషంతో పండుగ చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియచేశారు. విఘ్నా లను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజలందరి జీవితాల్లో శాంతి, ఐశ్వర్యం, ఆనందం నిండాలని కోరుకుంటున్నానన్నారు. గణనాథుడి దయతో ప్రతి కుటుంబం సుఖసం తోషాలతో ఉండాలన్నారు. పర్యావరణహిత గణేష్ విగ్రహాలను ప్రతిష్టించి, పండుగను సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలని మంత్రి ఆకాక్షించారు.

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా ప్రజలకు ఎంపీ బస్తిపాటి నాగరాజు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వాసులు విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు, ఆటంకాలు తొలగి సుఖసంతోషాలతో, ఆయురారో గ్యాలతో అభివృద్ధి పథంలో సాగాలని కోరుకొంటున్నానన్నారు. పండుగను భక్తి శ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని సూచించిన ఆయన, మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

డెంగ్యూతో చిన్నారి మృతి

విశాలాంధ్ర -వెల్దుర్తి : వెల్దుర్తి మండల సిపిఐ కార్యదర్శి టి.క్రిష్ణ కూతురు 7సంవత్సరాల మోక్షిత డెంగ్యూ జ్వరంతో మరణించడం విచారకరమని జిల్లాఅధికారులు అన్నారు. ఈ విషయం తెలుసుకున్న వారు కర్నూలు జిల్లాకలెక్టర్ పి.రంజిత్ భాష ఆదేశాల మేరకు కర్నూలు ఆర్డీఓ సందీప్కుమార్, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ శాంతికళ, డిపిఓ భాస్కర్, డిఎల్పిఓ లక్ష్మీ, డిప్యూటీ ఎంపిడిఓ రవికిశోర్, వెల్దుర్తిమేజర్ గ్రామపంచాయతీ ఇ.లక్ష్మీనాథ్‌తో కలిసి వెల్దుర్తికి చేరుకొని చిన్నారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను విచారించి ఓదార్చారు. చిన్నవయస్సులో చిన్నారి మరణం చాలా బాధకరమన్నారు. ధైర్యంగా ఉండాలని తల్లితండ్రులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు డిఎం అండ్ హెచ్ఓతో మాట్లాడుతూ తమ కుమార్తెనుపై అంతస్తులో వైద్యం చేయించుకోవాలని అన్నారన్నారు. వైద్యచికిత్సల సమయంలోప్రతి సారి కిందకు పైకి దిగడం చేశామన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె చనిపోయిందని తల్లితండ్రులు వాపోయారు. తమ కడుపుకోతను తీర్చేదెవరు అని వారు ఆవేదన చెందారు. మరెవరికి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న సిపిఐ మండల కార్యదర్శి టి.క్రిష్ణ సునీత కుమార్తె చిన్నారి మోక్షిత(7) డెంగ్యూ జ్వరంతో అల్లాడుతూ మంగళవారం తెల్లవారుజామున కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు ఈ చిన్నారి జ్వరంతో బాధపడుతుంటే తల్లితండ్రులు ఈనెల 21న వెల్దుర్తిపిహెచ్సిలో చేర్పించారు. అయితే డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని, రక్తకణాలు తక్కువగా ఉన్నట్లు ఇక్కడి వైద్యులు గుర్తించి కర్నూలు ప్రభుత్వఆసుపత్రికి వెళ్లాలని రెఫర్ చేశారు. కుటుంబ సభ్యులు ఆ చిన్నారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు వైద్యపరీక్షలు చేయించి చిన్నారికి డెంగ్యూ జ్వరం ఉన్నట్లు నిర్ధారించారు. అయితే కోలుకోలేక చిన్నారి మృతిచెందింది. ఆ చిన్నారిని కుటుంబ సభ్యులుతాము నివాసముంటున్న వెల్దుర్తికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపిపి యల్.ఇ. జ్ఞానేశ్వర్ గౌడ్, తెదేపా నాయకులు టి.ఇ.బలరాంగౌడ్,సిపిఐ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, వెల్దుర్తి మండల జర్నలిస్టులు, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు ఆ చిన్నారి ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. తల్లితండ్రులకు తమసంతాపం తెలియజేశారు. డెంగ్యూ జ్వరంతో చిన్నారి మోక్షిత మృతిచెందడం బాధాకరమని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. చిన్నారి మరణవార్త విన్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి, జడ్పీటీసిసభ్యులు దాదిపోగు సుంకన్నతో కలిసి వారి ఇంటికి వెళ్లి చిన్నారి మృతదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తల్లితండ్రులకు ఆమె ధైర్యం చెప్పారు.

పాసింగ్ విధానాన్ని కొనసాగించాలి : సీపీఐ

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఆదోని జాతీయ వ్యవసాయ మార్కెట్ కమిటీలో మహిళలకు ఉపాధిలో భాగంగా పాసింగ్ విధానాన్ని కొనసాగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి టి.వీరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ నందు గత 40 సంవత్సరాలు పైబడి మధ్యాహ్నం పాసింగ్ కూలీలుగా వందలమంది పని చేసే వారని గుర్తుచేశారు. వారి అమ్మలు, అమ్మమ్మలు, జేజమ్మలు నుండి మార్కెట్ యార్డ్ నందు మధ్యాహ్నం పాసింగ్ కూలీలుగా పనిచేస్తూ జీవనం కొనసాగించేవారన్నారు. అర్ధాంతరంగా పాసింగ్ విధానాన్ని రద్దు చేయడం వల్ల వందల మంది మహిళలు ఉపాధి కోల్పోయి జీవనోపాధిలేక వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. పాసింగ్ విధానం ద్వారా రైతులకు నష్టం జరుగుతుందనే అపోహను అధికారులు వీడాలని,పాసింగ్ విధానం వల్ల సరుకు శుభ్రం చేసే కూలీ ట్రేడర్ భరిస్తారన్నారు. దీంతో రైతుకు పరోక్షంగా లాభం చేకూరుతుందని తెలిపారు. అనంతరం కార్యదర్శి కల్పనకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రమేష్, డిహెచ్పిఎస్ కార్యదర్శి విజయ్, ప్రజానాట్యమండలి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

గోపాల్ సింగ్ మృతి సిపిఐకి తీరనిలోటు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండలంలోని బైసిగిరి గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకుడు గోపాల్ సింగ్ మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని సిపిఐ మండల కార్యదర్శి తలబావిరాజు ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మదిరి ఎల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తూరు గంగన్న అన్నారు. మంగళవారం గోపాల్ సింగ్ మృతదేహానికి సిపిఐ ఎర్రజెండ కప్పి నివాళులార్పించారు. 1980లో పార్టీ సభ్యత్వం పొందరని గుర్తు చేశారు.నాటి నుంచి నేటి వరకు పార్టీ సిద్ధాంతలకి కట్టుబడి ఉంటూ ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారన్నారు. అయన పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. మృతుడి కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నిక్షయ్ మిత్రులకు సర్టిఫికెట్లు పంపిణీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం వైద్యులు షేకన్ భాను, ఫిరదౌసి, రవికుమార్, సుస్మిత నిక్షయ్ మిత్రులకు సర్టిఫికెట్లను అందజే శారు. వారు మాట్లాడుతూ క్షయవ్యాధి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిక్షయ్ మిత్రుల సహకారం మరువలేనిదని కొనియాడారు. క్షయవ్యాధి రోగులకు ప్రతి నెలా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. ప్రతి ఒక్కరూ క్షయ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేసిన 15మంది నిక్షయ్ మిత్రులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

మదర్ థెరిసా జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : ఎమ్మిగనూరులో స్థానిక చిన్న పిల్లలు అనాథ ఆశ్రమంలో మంగళవారం మదర్ తెరిసా చిత్రపటానికి మల్లెల గ్రూప్ అధినేత డా, మల్లెల ఆల్ ఫ్రైడ్ రాజు పూలే అంబేద్కర్ రాష్ట్ర అధ్యక్షులు, డా,, కామళే గణేష్ రాష్ట్ర సలహాదారుడు, అధ్యక్షురాలు ప్రతిభ భారతి బీసీ రామచంద్ర పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న రాష్ట్ర ఈసీ నెంబర్ కె. నాగరాజు జే.యువరాజు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు రోజులపాటు జరుపుకునే గణేశు ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు ఎస్సై చిరంజీవి సూచించారు. నేటి నుంచి గణేష్ ఉత్సవాలు సందర్భంగా వినాయక చవితి వేడుకలు నిర్వహణపై ఎస్సై చిరంజీవి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకొని గొడవలకు దూరంగా ఉండాలని తెలియజేశారు. నిబంధన ప్రకారమే గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గణేష్ మండపాల నిర్వహణకు గుర్తు చేశారు. ఈనెల 29న గణేష్ నిమజ్జనం ఉంటుందని వినాయకుని ఊరేగింపు త్వరితగా పూర్తి చేసుకోవాలని యువతకు సూచించారు. ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపుతామని సిఐ హెచ్చరించారు.

సార్ మా గ్రామానికి యూరియా సరఫరా చేయండి

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలోని నాగర కన్వి గ్రామానికి యూరియా సరఫరా చేయండి సార్ అంటూ తాసిల్దార్ నిజాముద్దీన్‌కు మంగళవారం రైతులు వెంకటేష్, తిమ్మారెడ్డి, ఉలు లుగప్ప, దేవన్నలు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు తమకు యూరియా అందలేదని యూరియా అందకపోవడంతో పంటలకు ఎరువు వేయలేకపోయామని వాపోయారు. వర్షాలు బాగా కురిసాయని పంటల దిగుబడికి యూరి యా ఎంతో అవసరం అని అందువల్ల యూరియా మంజూరు చేస్తే వంటల దిగుబడికి ఎంతో మేలు అవుతుందని అన్నారు. అన్ని గ్రామా లకు అధికారులు యూరియా సరఫరా చేసి మా గామాన్ని మర్చిపోయా రని ఆరోపించారు. తాసిల్దార్ నిజాముద్దీన్ ఫోన్ ద్వారా మండల వ్యవసాయ అధికారి ఆనంద్‌కు వెంటనే రైతులకు యూరియా సరఫరా చేయాలని ఆదేశించారు.

హెచ్ఐవి,ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - ఆస్పరి : యువత, విద్యార్థులతొ పాటు ప్రతి ఒక్కరూ హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలని ప్రాజెక్ట్ మేనేజర్ రమణ అన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటెన్సిఫైడ్ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ హ్యూమన్ అండ్ నేచురల్ రిసోర్సెస్ డెవలప్మెంట్ సొసైటీ వారు విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధుల, డ్రగ్ డి - ఆడిక్షన్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో హెచ్.ఐ.వి పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని అలాగే పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి పి హెచ్ సి ల్యాబ్ టెక్నీషియన్ హరికృష్ణ, వైష్ణవి, కళాశాల అధ్యాపకులు వైష్ణవి, కైరూన్.బీ విద్య, వైద్య సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారులు వచ్చారని..

బెంబేలెత్తిన ఎరువుల షాప్ యజమానులు...!

- మండలంలో ఎరువుల షాపులు బంద్
- మండల వ్యవసాయ అధికారుల తనిఖీలు ఏమైనట్లు..
- ముందస్తు సమాచారం ఇవ్వడంతోనే బంద్ చేశారని ఆరోపణలు

విశాలాంధ్ర - నందవరం : విజిలెన్స్ శాఖ అధికారులు వచ్చారని అనుమానం రావడంతో ఎరువుల షాపుల యజమానులు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. నందవరం మండలంలో గత రెండు రోజులుగా విజిలెన్స్ అధికారులు తిరిగుతున్నారని అనుమానం రావడంతో మంగళవారం ఉదయం నుండి ఫెర్టిలైజర్స్, పేస్టీ సైడ్స్ షాపుల యజమానులు షాపులను బంద్ చేశారు. విషయం తెలియని రైతులు ఉదయం నుండి ఎరువులు, పిచికారి మందుల కోసం షాపుల ముందు పడి కాపులు కాసారు. అయితే సాయంత్రానికి షాపులు తెరుచుకోవడంతో ఇదేమిటి అని కొంతమంది రైతులు అడగ్గా విజిలెన్స్ అధికారులు వచ్చారని, అందుకోసమే షాపులు బంద్ చేశామని అనడంతో రైతులు అవాక్కయ్యారు. నిరంతరం మండల, తాలూక స్థాయి అధికారులు తనిఖీ చేస్తుంటే ఎరువులు షాప్ యజమానులు విజిలెన్స్ అధికారులు వచ్చారని ఎందుకు షాపులు బంద్ చేశారని, అంటే ఎరువుల షాపు యాజమానులతో వ్యవసాయ అధికారులు కుమ్మక్కై తూతు మంత్రంగా తనిఖీలు చేస్తూ ముడుపులు తీసుకుంటున్నారని రైతు సంఘం నాయకులు దేవపుత్ర ఆరోపించారు. గత రెండు రోజుల క్రితం కూడా ఓ ప్రముఖ ఎరువుల షాపు యజమాని షాపు నుండి 2 ట్రాక్టర్ల యురియాను తెలంగాణ అమ్ముకున్న వ్యవసాయ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు నిష్పక్షపాతంగా తనిఖీలు చేసి యజమానులపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ అధికారి సరిత వివరణ : సోమవారం విజిలెన్స్ అధికారులు ఎమ్మిగనూరులో వచ్చిన మాట వాస్తవమని,నందవరంలో పర్యటించినట్లు ఎక్కడ సమాచారం లేదన్నారు.మంగళవారం షాపు యజమానులు బంద్ చేస్తే అది వాళ్ళ వ్యక్తిగతమని,వినాయక చవితి ఉన్నందున బంద్ చేసి ఉండొచ్చని, ఎందుకు షాపులుబంద్ చేశారో యజమానులను వివరణ కోరుతానని తెలిపారు.

ఉన్నత పాఠశాల నిర్మాణంకు 4ఎకరాల భూమి విరాళం

విశాలాంధ్ర - ఆలూరు : ఆలూరు మండలము ముద్దనగేరి పుట్టి పెరిగిన స్వంత గ్రామానికి మేలు చేయాలనే ఉద్దేశంతో గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం కోసం టిడిపి సీనియర్ నాయకుడు, తెలుగు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ముద్దనగేరి నారాయణ రెడ్డి తన స్వంత 4 ఎకరాల భూమిను విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డిఈఈ విష్ణు వర్ధన్ రెడ్డి, ఆలూరు ఎంఈఓ-2 చిరంజీవి రెడ్డిలు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే స్థలాన్ని స్కూల్ పేరు మీదుగా రిజిస్టర్ చేసి విద్యాశాఖ అధికార్లకు అప్పగిస్తామని నారాయణ రెడ్డి తెలిపారు. గ్రామంలో హై స్కూల్ లేకపోవడం వల్ల పక్క గ్రామాలకు ఆడపిల్లలు వెళ్లాలంటే ఇబ్బందిగా మారుతుందని అందుకే తన వంతుగా విద్య అభివృద్ధికి కృషి చేసేందుకు స్థలాని విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు పి4 కార్యక్రమంలో బాగంగా అనాథ వృద్ధురాలిని దత్తత తీసుకుని ఆలనపాలన చూస్తున్నట్లు తెలిపారు.

మదర్ థెరిసా సేవలు మరువలేనివి : టీజీ వెంకటేష్

విశాలాంధ్ర - కర్నూలు : ఎక్కడో పుట్టి భారతదేశానికి వచ్చి దేశ ప్రజలకు మదర్ థెరిసా చేసినటువంటి సేవలు చిరాస్మరణీయమని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. మదర్ తెరిసా 116వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ప్రకాష్ నగర్‌లో ఉన్న మదర్ తెరిసా విగ్రహానికి రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మదర్ తెరిసా పుట్టినరోజును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన బర్తే కేకును రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడో విదేశాల్లో పుట్టి మన దేశానికి వచ్చి పేద ప్రజలకు మదర్ తెరిసా చేసిన సేవలు అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. మదర్ తెరిసా స్ఫూర్తితో గత 20 సంవత్సరాలుగా అభయగిరిలో ఉన్న హెచ్ఐవి,ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం కొరకు సేవలు చేస్తుండడం అభినందనీయమన్నారు. అభయగిరిలో సేవా కార్యక్రమాలు నిమిత్తం తమవంతుగా సహాయ సహకారాలు అందజేస్తున్నట్టు టీజీ వెంకటేష్ తెలిపారు. ఈ శ్రీ లక్ష్మి విద్యా సంస్థల డైరెక్టర్ దీక్షిత్, సురేంద్ర, డాన్సర్ రామకృష్ణ, అభయగిరి నిర్వహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లి పంటకు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర-పత్తికొండ: అధిక వర్షాల వల్ల ఉల్లి పంట నష్టపోయిన రైతులకు పంట రాష్ట్ర పరిహారం ఇవ్వాలని సిపిఐ ఎంపీటీసీ సభ్యులు పెద్ద ఈరన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ నారాయణదాసు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంపీటీసీ సభ్యులు పెద్ద ఈరన్న సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్ లో ఉన్న 8 వారాల వేతనాలను తక్షణమే ఇవ్వాలన్నారు. పట్టణంలోని వీకే ఆదినారాయణ రెడ్డి కాలనీలో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రశ్నించగా, ఈవోఆర్‌డి నరసింహులు సానుకూలంగా స్పందించారు. మెడికల్ షాపు లలో నకిలీ మందులను అరికట్టాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలలో 25% సీట్లు కేటాయించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ పాఠశాలలలో అధిక ఫీజులను అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ హుస్సేన్ సాహెబ్, ఎంపీడీవో కవిత, డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు, వైస్ ఎంపీపీ రంగమ్మ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: 2025-26 సంవత్సరానికి గాను స్టేట్ కోటా క్రింద ఎంబిబిఎస్ మొదటి సంవత్సరంనకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని మొదటి రోజు 68 మంది విద్యార్థులు కర్నూలు మెడికల్ కాలేజ్ యందు అడ్మిషన్ తీసుకున్నారని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 తేదీ వరకు ఫస్ట్ ఫేస్ అడ్మిషన్లకు అవకాశం ఉందని ఆమె తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 27, ఆగస్టు 2025

ప్రజా సేవలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలి
- ఫైళ్లను ఆలస్యం చేయకుండా క్లియర్ చేయాలి
- నూతన కార్యాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సేవలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ నగరపాలక కార్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విభాగం సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే వారిలో అసంతృప్తి పెరుగుతుందన్నారు. కాబట్టి ఏ ఫైలు కూడా వాయిదా వేయకుండా, వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను సీరియస్‌గా పరిగణించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఫైళ్ల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి సమయపాలన తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ నిర్మాణంలో ఉన్న నూతన మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించారు. పనుల పురోగతి గురించి అధికారులను ఆరా తీశారు. ఈ కొత్త కార్యాలయం పూర్తయితే ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం లభిస్తుందని, కాబట్టి పనులు నాణ్యతతో కూడినవిగా, వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి దశలో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అలాగే అక్కడ వెంటనే స్వచ్ఛత పనులను చేపట్టాలని, మున్సిపల్ కార్యాలయ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు ప్రభావితులు సహకరించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య
ఆస్తి కోల్పోయే యజమానులతో సమావేశం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగర పరిధిలో శ్రీ దామోదరం సంజీవయ్య కూడలి నుండి కెవిఆర్ గార్డెన్స్ వరకు రహదారి విస్తరణలో ప్రభావితమయ్యే ఆస్తి యజమానులు నగరాభివృద్ధికి సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య పిలుపునిచ్చారు. మంగళవారం చెక్‌పోస్ట్ సమీపంలోని దేవి ఫంక్షన్ హాల్లో 82 మంది ప్రభావిత ఆస్తి యజమానులతో జెసి, కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. నగరానికి భవిష్యత్ రవాణా సౌకర్యాలు మెరుగుపడటానికి రహదారి విస్తరణ అత్యవసరమని, త్వరితగతిన పనులు ప్రారంభించాలని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎవరూ నష్టపోకుండా, ఆస్తులు కోల్పోతున్న వారికి టిడిఆర్ బాండ్ల రూపంలో, భవనాలకు నగదు రూపంలో తగిన పరిహారం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కొందరికి బాండ్లు అందజేశామని, త్వరలో మిగిలిన వారికి కూడా ఇస్తామన్నారు. మెరుగైన రవాణాకు, ట్రాఫిక్ నియంత్రణకు నగరాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రభావితుల్లో ఇప్పటికే ముగ్గురు బాధితులకు టిడిఆర్ బాండ్లు అందజేశామని, మరో 47 మందికి త్వరలో పంపిణీ చేసే ప్రక్రియ జరుగుతుందన్నారు. ఒకేసారి ప్రభావితులందరూ సహకరిస్తే పరిహారం పంపిణీ త్వరగా పూర్తి చేసి, పనులను త్వరగా ప్రారంభించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిసిపి వెంకట రమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా జయంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : సేవా స్ఫూర్తి ప్రదాత మదర్ తెరిసా జన్మదినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు, పోసిన సిల్క్స్ అధినేత పోసిన సుబ్బారావు సౌజన్యంతో దివ్యాంగులకు వినాయక చవితి పండుగ సరుకులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలో సేవకు ప్రతీకగా నిలిచి, ఆపన్నులకు చేయూతనిచ్చిన మదర్ తెరిసా స్ఫూర్తితో లయన్స్ క్లబ్, దివ్యాంగుల సంక్షేమ సంఘం, ఐఎంఎ ద్వారా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి భాస్కరరెడ్డి, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీవి రమణయ్య, క్లబ్ సభ్యులు మేడం చంద్రశేఖర్, రామయ్య, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సస్యరక్షణపై రైతులకు శిక్షణ

విశాలాంధ్ర - రుద్రవరం : రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి చెన్నయ్య తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంగళవారం మండలంలోని మందలూరు గ్రామంలో ఆర్కే వీ వై పథకం కింద రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటేశ్వర రెడ్డి, వ్యవసాయ అధికారి సుమతి, విస్తరణ అధికారి రాజు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వనరుల వ్యవసాయఅధికారి చెన్నయ్య మాట్లాడుతూ రైతులకు మినుము పంట గురించి, మొక్కజొన్నలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వరి పంటలో కలుపు యాజమాన్యం గురించి వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకులువెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ పంటలలో డ్రోన్ ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమం లోమండల వ్యవసాయ విస్తరణ అధికారి ఫహీమా, రైతు సేవా సహాయకులు రమాదేవి , రైతులు పాల్గొన్నారు

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును కలిసిన బేడ, బుడగ జంగ రాష్ట్ర అధికార ప్రతినిధి



విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును బేడ, బుడగ జంగ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గ రాముడు మర్యాద పూర్వకంగా కలిశారు. భీమవరం నగరంలోని ఆయన స్వగృహం నందు రాష్ట్ర బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును రాష్ట్ర బేడ, బుడగజంగాల అధికార ప్రతినిధి, నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు కలిశారు. ఈ సందర్భంగా బుగ్గరాముడు మాట్లాడుతూ బేడా బుడగ జంగం కులానికి సాదృశ్యం అయిన తాంబూరా, గుమ్మెట తీసుకొని మా యొక్క కులానికి సంబంధించిన కలను డిప్యూటీ స్పీకర్ ముందు ప్రదర్శించడం జరిగిందని, అదే విధంగా బేడ బుడగ జంగం కులాన్ని త్వరలో ఎస్సీ జాబితాలో చేర్చాలని డిప్యూటీ స్పీకర్ కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ స్పీకర్ వెంటనే స్పందించి ఒక ప్రతినిధి బృందాన్ని శీతాకాల పార్లమెంట్ సమావేశాలలో ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర మంత్రి అమిత్ షా, రాజనాథ్ సింగ్ లతో మాట్లాడి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బుగ్గ రాముడు తెలిపారు. సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు తాటికొండ కొండయ్య, సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు, కళాకారులు జమ్మయ్య, సుంకన్న, ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడి - అధిక లాభాలు



విశాలాంధ్ర - చాగలమర్రి : రైతులు తక్కువ పెట్టుబడి తో అధిక లాభాలు పొందాలనే ధ్యేయంతో కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు సరళమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలం లోని ముత్యాలపాడు,డి. కొత్తపల్లె గ్రామాలలో ఏఓ రంగనేతాజీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సుధాకర్ మొక్క జొన్న, మినుము పంటలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. ఉద్యాన శాస్త్ర వేత్త ఆదినారాయణ గారు ఉల్లి పంటలో పురుగు మరియు పొడ తెగులు, చుట్ట తెగులు కు పాటించవలసిన సస్య రక్షణా చర్యల గురించి వివరించారు. శాస్త్ర వేత్త రవి కె.వి. కె ద్వారా రైతులకు వివిధ పంటలలో పాటించవలసిన సాగు మెలుకువలు గురించి అవగాహన కల్పిస్తూ తక్కువ పెట్టుబడితో రైతుకు లాభం చేకూర్చే పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డి. వనిపెంట సర్పంచ్ బాలీశ్వరరెడ్డి,జిల్లా వనరుల కేంద్రం ఏఓ చంద్ర శేఖర్ రెడ్డి,గ్రామ ఉద్యాన సహాయకులు ఉమ,మనీషా,రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం



విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: నగరంలోని అవుట్ డోర్ స్టేడియంలో మంగళవారం జిల్లాస్థాయి ఫెన్సింగ్ క్యారెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్. శంకర్ శర్మ పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు.ఫిన్సింగ్ గేమ్ క్రీడాకారుల వ్యక్తిగత ప్రతిభ పై ఆధారపడి ఉంటుందన్నారు.జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవుతారన్నారు.ఈనెల 30న భీమవరం లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు క్రీడాకారులు విజయం సాధించాలని కోరారు. ఫెన్సింగ్ గేమ్ ఎంతో ప్రాచీనమైనదని రాజుల కాలం నుంచి ఉందన్నారు.భారత దేశంలో 1997లో ఫిన్సింగ్ గేమ్ అధికారికంగా గుర్తింపు పొందిదని తెలిపారు. ఈగేమ్ లో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు ఏకాగ్రత ఎక్కువగా ఉండాలని సూచించారు. క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా అమ్మాయిలు ఎంతో జాగ్రత్తలు పాటించి ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో బాలుర విభాగంలో నిఖిలష్, షేక్ షారూక్, కుందన్ గౌడ్, విజయుడు, హుస్సేన్, రవీంద్ర నాయక్,షణ్ముక, మోక్షజ్ఞ, నాగ కార్తికేయ రెడ్డి,రఫీ,నాగలక్ష్మి చరణ్ జిత్, నిహంత్ విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో అరోణ క్లాతరిన్, కావ్య శ్రీ, సానియ,అక్షర,చిన్మయి షరియ, అశ్రిత రెడ్డి, జీవన శ్రీ, దీక్షిత, సాత్విక, మేఘన,శ్రీ వైష్ణవి, కావ్య విజేతలగా నిలిచారు.ఈకార్యక్రమంలో సీసీఎస్ సీఐ.నాగశేఖర్,కర్నూలు ఫిన్సింగ్ కోచ్ మహేష్, నంద్యాల కోచ్ లక్ష్మీ నారాయణ,మణికంఠ,కాలి,సాయిలు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.38లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత



విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ యూనిట్ నందు హోంగార్డుగా పనిచేయుచున్న ఎస్. మాలిక్ భాషా విధులు ముగించుకొని వెళ్తున్న క్రమంలో ఆళ్లగడ్డ నుండి దొర్నిపాడు మధ్యలో యాక్సిడెంట్ కు గురికావడంతో మే 16, 2025 న చనిపోవడం జరిగింది. సదరు హోంగార్డుకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండడంతో హోంగార్డు కుటుంబానికి పోలీస్ సాలరీ ప్యాకేజ్ కింద యాక్సిస్ బ్యాంక్ వారు 30,00,000/- లక్షల ప్రమాద బీమా కల్పించడంతో పాటు హోంగార్డు కూతురు మైనర్ కావడంతో 8,00,000/- లక్షలు అదనంగా బీమా సౌకర్యం కల్పించారు. యాక్సిడెంట్ కు గురికాబడిన హోంగార్డు కుటుంబానికి (భార్య హుస్సేన్ బి, వారి పిల్లలకు) మొత్తం 38లక్షల రూపాయలను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, హోంగార్డ్ డీఎస్పీ ప్రసాద్, యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు గంబూషియా చేపల విడుదల



విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని గొట్లూరు గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దోమల నియంత్రణకు నీరునిల్వ ఉన్న కుంటలో గంబూషియా చేపలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు ఆళ్ళగడ్డ సబ్‌యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు,సాగునీటి సంఘం అధ్యక్షుడు అన్నపురెడ్డి జమాల్ రెడ్డి,హెల్త్ అసిస్టెంట్ మనోహర్‌లు గ్రామంలోని గల నీటి కుంటలో సుమారు 300 గంబూషియా చేపలను వదిలారు. అనంతరం వారు మాట్లాడుతూ నీటిలో అభివృద్ధి చెందుతున్న దోమల లార్వాలను గంబూషియా చేపలు కట్టడి చేస్తాయని తెలిపారు. దోమ కాటు నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లీలావతి,ఆశా కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - బనగానపల్లె : గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దామని కేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు టంగుటూరి సీనయ్య, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాడు పట్టణంలోని గణేష్ మండపాలను వారు సందర్శించారు. ఈ మేరకు మండపాల నందు ఏ సమయంలో ఎవరికి అవసరమైన తమను సంప్రదించాలన్నారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు తమకు సహకరిస్తున్నందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.నాగేష్ మద్దిలేటి, హిందూ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల దుకాణాల తనిఖీ



విశాలాంధ్ర - వెలుగోడు: పట్టణం లోని అన్ని ఎరువుల దుకాణాలను మండల టీం అధికారులు మండల వ్యవసాయ అధికారిణి స్వాతి , డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ , ఎస్. ఐ సురేష్ మంగళవారం తనిఖీలు చేశారు. ఫర్టిలైజర్స్ గోడౌన్ల ను తనిఖీ చేసిన అధికారులు మాట్లాడుతూ అధిక ధరలకు విక్రాయిస్తే కఠిన చర్యలు తప్పవని ,యూరియా గురించి తనిఖీలు నిర్వహించడం జరిగినది అన్నారు. దీనిలో భాగంగా డీలర్ యొక్క డిబిటి మరియు ఫిజికల్ బ్యాలెన్సును తనిఖీ చేయడం జరిగింది. అక్కడికి వచ్చిన రైతులతో అందరూ కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని ఎవరైనా అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలిసిన యెడల మాకు వెంటనే తెలియజేయాలని తెలపడం జరిగింది. అలా ఏదైనా కంప్లైంట్ నమోదు అయిన, డీలర్ల లైసెన్సు రద్దు చేయడానికి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది.

పర్యావరణ హిత ఏకో ఫ్రెండ్లీ గణేశ్ విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్ 100 కుటుంబాలకు ఎకో ఫ్రెండ్లీ గణేశ్ విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు. కాలుష్యాన్ని నివారించి సుస్థిరమైన ఉత్సవ సంస్కృతి ఏర్పరుచుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ టౌన్ సిఐ యుగంధర్, ఎస్ఐలు జయప్ప, నగీనా మరియు సిబ్బంది పాల్గొన్నారు.

వొకేషనల్ కళాశాలలో మదర్ థెరిసా జయంతి

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : కర్నూలు బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల లో మంగళవారం నాడు మదర్ థెరిసా 113వ జయంతిని ప్రిన్సిపాల్ డాక్టర్ యస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శాంతి, కళాశాల ప్రిన్సిపాల్ మరియు లెక్చరర్స్ మదర్ థెరిసా చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్ , జబీన్ అక్తర్,సోమేష్, ఉల్లోజి రావు, చిన్న మల్లేశ్వరుడు , బాల శంకర్, శ్రావణి, జసింత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన సుజాత

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : క్లస్టర్ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు)జంతు శాస్త్ర అధ్యాపకురాలు బి.సుజాత డాక్టరేట్ డిగ్రీని పొందినందుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి హర్షం వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న బి.సుజాత శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలో జంతు శాస్త్ర ప్రొఫెసర్ అయిన ప్రొ.ఎం. భాస్కర్ పర్యవేక్షణలో " డిటర్మినేషన్ ఆఫ్ ఫార్మాల్డిహైడ్ - ఇండ్యూస్డ్ , యాంటీ ఆక్సిడెంట్, మెటబాలిక్ అండ్ హిస్టో పాథోలాజికల్ చేంజెస్ ఇన్ ది లివర్ అండ్ మజిల్ అఫ్ మేల్ రాట్స్ : ఎ స్పెషల్ ఫోకస్ ఆన్ లివర్ జీన్ ఎక్స్ప్రెషన్ అండ్ రివెర్షన్ అఫ్ చేంజెస్ విత్ బ్రాంకోటి " అను అంశం పై విస్తృతమైన పరిశోధన చేసి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫి (పిహెచ్‌డి) డిగ్రీని పొందినట్లు వారు తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు వారికి అభినందనలు తెలిపారు. బి.సుజాత స్వగ్రామం ఆళ్లగడ్డ. గత 18 సంవత్సరాలుగా ప్రభుత్వ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తూ, పరిశోధనపై మక్కువతో ఈ అంశంపై పరిశోధన చేశానని,పరిశోధనలో తనకు సహకరించిన కుటుంబ సభ్యులకు, కళాశాల ప్రిన్సిపాల్‌కి, అధ్యాపకులకు, తోడ్పాటునందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



విశాలాంధ్ర - సి.బెళగల్ : పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగబడులు పొందవచ్చునని శాస్త్రవేత్తల బృందం అన్నారు. మండల పరిధిలోని పోలకల్ గ్రామ రైతు సేవా కేంద్రం నందు మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థాన శాస్త్రవేత్తల బృందం శాస్త్రవేత్త విష్ణువర్ధన్ (బ్రీడర్), బాలాజీ నాయక్, శాస్త్రవేత్త చైతన్య (ప్లాంట్ పాథాలజీ) పోలకల్ గ్రామ పరిధిలోని పత్తి పంటలో రైతులకు యాజమాన్య పద్ధతుల గురించి వారు వివరించారు. వ్యవసాయ సిబ్బంది ఏఈఓ హిమబిందు వివిఏలు శశికాంత్, లలిత, రైతులు రాఘవరెడ్డి, సత్యారెడ్డి, తిక్కన్న, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వరుడి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కోడుమూరు : కోడుమూరు మఠం,జంగమ మహేశ్వరులు,వీరశైవులు,భక్తులు వీరభద్రేశ్వరస్వామి జయంతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కోడుమూరు వీరశైవ లింగాయతీ దైవాచార సంక్షేమ సంఘం సభ్యులు శెట్టి వీరప్ప,రంగాపురం బసన్న, ఆకుల నాగరాజు,డిష్ రవీ,ఎస్జి చంద్రశేఖర్,ఎస్జీ శ్రీకాంత్, నాగప్ప, పరమేష్ తదితరుల ఆధ్వర్యంలో శ్రీ వీరభద్రస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా పట్టణంలోని స్థానిక మెయిన్ బజారులో వెలసిన మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం,ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రేశ్వరస్వామి చిత్రపటాలతో వీరశైవులు ఊరేగింపుగా స్థానిక కోటవీధిలోని వీరభద్రస్వామి ఊరేగింపుగా వెళ్లారు. స్థానిక మునుమంద వీధి, సాయిబాబా ఆలయం మీదుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో శెట్టి రామప్ప,సిపిఐ కృష్ణ,బి నాగప్ప,తిమ్మాపురం పరమేశ్వప్, బి.నాగరాజు,ఆకుల ఆనంద్,ఎస్జి వినయ్,శెట్టి రవి, దీపక్,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



విశాలాంధ్ర - ఆలూరు : ఆలూరు పట్టణంలోని మంగళవారం తాహసిల్దారు శోభా సువర్ణమ్మ, ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ నిబంధన విరుద్ధంగా అమ్మకాలు చేస్తే అలాంటి దుకాణాలపై చర్యలు తప్పు అని వారు తెలిపారు. రాధాస్వామి ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో ఎరువులు అమ్మకాలు ఎలా చేస్తున్నారని షాప్ యజమాని అడుగుతూ అదేవిధంగా స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర గౌడ్, మాట్లాడుతూ డీలర్లు ఎవరైనా రైతులకు యూరియాను ఎమ్మార్పీ ధర మించి అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా ఇస్తామన్నారు. ఎవరు కూడా రైతులు ఆందోళన చెందవద్దని అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరే బసవన్న గౌడ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే మేలు

విశాలాంధ్ర - వెలుగోడు : వినాయక చవితి పండుగ సందర్భంగా ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్ లో వాసవి కాంప్లెక్స్ నందు ఈ వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం లో టిడిపి నియోజకవర్గం కన్వీనర్ అన్నారపు శేషిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు అబ్దుల్ కలాం , పట్టణ అధ్యక్షులు మోమిన్ రసూల్ పట్టణ క్లస్టర్ ఇంచార్జి ఖలీల్ ఖాన్, ఆర్య వైశ్య నాయకులు పాల్గొని ఇంటిలో పూజించుకునే సుమారు 500 చిన్న మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణి చేశారు.

ప్రారంభోత్సవం సిద్ధంగ ఉన్న అంగన్వాడీ కేంద్రాలు



విశాలాంధ్ర -హొళగుంద: మండలంలోని బొమ్మ గుండ నహల్లి, చిన్నహ్యాటలో గత ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలను నిర్మించి అర్ధాంతరంగా నిలిపివేయడంతో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ సహాయంతో ఒక్కొక్క అంగన్వాడి కేంద్రానికి ఐదు లక్షల రూపాయలు ప్రకారంగా 10 లక్షల రూపాయలు మంజూరు చేశారు. అర్ధాంతంగా నిలిచిపోయిన అంగన్వాడి భవనానికి ప్లాస్టరింగ్ చేసికిటికీలు, వాకిళ్ల బిగించి, భవనాలకు కొత్త రంగు వేయడంతో అంగన్వాడీ భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఎంపీటీసీ సభ్యుడు చాకలి శివన్న మంగళవారం తెలిపారు. రెండు గ్రామాల్లో పిల్లల చదువులు అద్దె భవనాల్లో కొనసాగుతున్నా యని పిల్లలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పడుతున్న కష్టాలను చూసి అంగన్వాడి భవనాలను అన్ని హంగులతో ముస్తాబు చేశామని అన్నారు. నూతన భవనాలు కొత్త రంగుతో గ్రామంలో కళకళలాడుతున్నాయి. ఆరోగ్యకరమైన వాతావరణంలో పిల్లల చదువులు జరగనున్నాయి ఎన్నో ఏళ్ల నుండి భవనం పూర్తి కాక ఎదురుచూస్తున్న తరుణంలో భవనాలు అన్ని హంగులతో ముస్తాబు కావడంతో కూటమి నాయకులకు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు, అధికారులకు , కాంట్రాక్టర్లకు,ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ అంగన్వాడి భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి కృషి చేసిందని ఎంపిటిసి సభ్యుడు శివన్న కొనియాడారు. అంగన్వాడి భవన కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : వచ్చే నెల 4న జరగనున్న గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. గతేడాది నిమజ్జనం రోజున చోటుచేసుకున్న లోపాలు పునరావృతం కాకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు.. లైటింగ్, క్రేన్లకు అదనపు డ్రైవర్లు, అందుబాటులో మెకానిక్‌లు, చెక్‌పోస్ట్ నుంచి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు మైక్ సిస్టమ్, మూడు షిఫ్టులుగా పారిశుధ్య సిబ్బంది నియామకం వంటి అంశాలను కోరారు.కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ.. "ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిమజ్జనం జరగడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తాం. అందరి సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. నగరంలోని గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినప్పుడు స్వచ్ఛతకు సహకరించాలని, వ్యర్థాలను ఒకచోట చేర్చి మున్సిపల్ సిబ్బందికి అందించేలా నిర్వాహకులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ గంగాధర్, ఏఈ వైష్ణవి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, సూపరింటెండెంట్లు మంజుర్ బాష, వాజిద్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వేణుగోపాల్, గోరంట్ల రమణ, రంగస్వామి, గిరిరాజ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన

విశాలాంధ్ర - గూడూరు : ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి దస్తగిరి రెడ్డి రైతులకు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గుడిపాడు, పెంచికలపాడు గ్రామాల్లో నంద్యాల వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించి లాభసాటి ఆదాయంపై రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి అధికారులచే సలహాలు తీసుకుంటే లాభసాటి ఆదాయం దక్కుతుందని గుర్తు చేశారు. ముఖ్యంగా రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల పైన దృష్టి పెట్టాలని తద్వారా అధిక దిగుబడితోపాటు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయని వారన్నారు. అధిక వర్షాలతో పంటలు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మోహన్ విజయ్, బాలాజీ నాయక్, చైతన్య, వి ఏ ఏ లు మోహన్ రెడ్డి, అనూష తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల కేంద్రంలో ఉన్న పిల్ల గురుకుల పాఠశాలలో మదర్ థెరిస్సా ఇంటి గ్రేడ్ నేషనల్ డెవలప్మెంట్ సొసైటీ వైద్య బృందం మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలయ్య వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డీ ల సమక్షంలో సుమారు 200 మంది విద్యార్థులకు వైద్య నిపుణులు ఇమ్రాన్ కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం కంటి ఆరోగ్య పరిరక్షణ పై విద్యార్థులకు అవగాహన కల్పించి కంటిచూపు విషయాలపై తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అలాగే కంటి జబ్బులపై ఎలాంటి అలసత్వం తగదని తెలిపి విద్యార్థులకు కంటి చుక్కల మందులు, మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపల్ తో పాటు తదితర ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.